జాడలేని చలివేంద్రం!

- ఏర్పాటుపై దృష్టి పెట్టని జీవీఎంసీ, స్వచ్ఛంద సంస్థలు
- గొంతెండి అల్లాడుతున్న పాదచారులు



భానుడి ప్రతాపానికి విద్యార్థినులు ఇలా..

అరిలోవ: ఏటా నియోజకవర్గంలో మండే వేసవి సమయాన విరివిగా పెట్టే చలివేంద్రాలు ఇప్పుడు ఎక్కడా కానరావడంలేదు. దీంతో బయటికి వచ్చే సాధారణ ప్రజలు గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఏటా జీవీఎంసీ ప్రజారోగ్యం కోసం నిధులు వెచ్చించి నగర నలుమూలలా చలివేంద్రాలు, మజ్జిక కేంద్రాలు ఏర్పాటు చేసేది. అయితే గత రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారి కారణంగా ఆ అలవాటు మానుకున్న జీవీఎంసీ ఈ ఏడాది కరోనా లేకపోయినా ఎక్కడా చలివేంద్రాలు పెట్టిన దాఖలాలు కనిపించడంలేదు.

కనిపించని నాయకులు

ఎన్నికలకు ముందు భయంకరమైన కరోనా ప్రభంజనం సాగుతున్న సమయంలో కూడా ప్రాణాలకు తెగించి కరోనా బాధితులకు, బయటికి రాలేని వారికి ఎన్నో సేవలు చేసి.. శానిటరీ వస్తువులు, మందులు, ఆహార పొట్లాలు, కాయకూరల వంటివి అందజేసిన నాయకులు ఇప్పుడు ఎక్కడా ఒక్క చలివేంద్రం పెట్టకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాదు సేవా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ విషయంలో అడుగు ముందుకు వేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అంటున్నారు.

భానుడి భగభగలు

భానుడి ప్రభావంతో వేసవి ఎండలు మండిపోతున్నాయి. బయటకు వెళుతున్న జనం ఎండకు తాళలేక నీడ పట్టున పడుతున్నారు. గొంతు ఎండిపోవడంతో దాహం తీర్చుకోవడానికి తాగునీటి కోసం పరుగులు పెడుతున్నారు. కిరాణా షాపులలో రూ.20 ఇచ్చి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసుకొని గొంతు తడుపుకొంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. తూర్పు నియోజకవర్గంలో ఆరిలోవ కాలనీ నుంచి అంబేడ్కగర్ కూడలి, తోటగరువు, చినగదిలి, పెదగదిలి, డెయిరీ ఫారం, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, ఇసుకతోట, మద్దిలపాలెం, పెదవాల్తేరు, చినవాల్తేరు తదితర ప్రాంతాలలో జీవీఎంసీ ప్రత్యేకంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి నిరంతరం తాగునీరు సరఫరా చేసేది. ఈ ఏడాది మాత్రం ఎక్కడా ఒక్క చలివేంద్రమైనా ఏర్పాటు చేయలేదు. గతంలో వేసవిలో కాలనీల కమిటీలు, స్వచ్ఛంద సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఎక్కడికక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు వారు కూడా కనిపించడంలేదు. ఇటీవల ఆరిలోవలో నెహ్రూనగర్ వద్ద ఓ స్వచ్ఛంద సంస్థ, చినగదిలిలో ఓ రాజకీయ నాయకుడు మాత్రమే చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో నెహ్రూనగర్‌లో వారం క్రితం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మొదటి రోజు మజ్జిగ, రెండు రోజు తాగునీరు అందుబాటులో ఉంచి మూడో రోజు నుంచి ఖాళీ కుండలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ప్రస్తుతం తీవ్రమైన ఎండలను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.

మూన్నాళ్ల ముచ్చటేనా?



సీతకొండ వద్ద ఐ లవ్ వైజాగ్ బోర్డులో ధ్వంసమైన అక్షరాలు

అరిలోవ: జీవీఎంసీ అధికారులు రూ.లక్షలు ఖర్చు చేసి సీతకొండ వద్ద ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్ బోర్డు మున్నాళ్ల ముచ్చటగా తయారైంది. జీ-20 సదస్సులో భాగంగా జీవీఎంసీ అధికారులు బీచ్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. విశాలాక్షినగర్ సమీప సీతకొండ మలువు వద్ద సీ వ్యూ పాయింట్‌ను జీ-20 సదస్సుకు హాజరైన స్వదేశీ, విదేశీ అతిథులను ఆకర్షించే విధంగా తయారు చేశారు. ఇక్కడ సీవ్యూ పాయింట్‌లో ఐ లవ్ వైజాగ్ అనే బోర్డును విడి అక్షరాలతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. సందర్శకులతో పాటు అటుగా వెళ్లే ప్రయాణికులు కూడా ఈ బోర్డు వద్ద ఆగి ఫొటోలు తీసుకొని ముచ్చటపడుతున్నారు. అయితే కొందరు ఆకతాయిలు ఈ బోర్డుకున్న అక్షరాలను నాశనం చేశారు. సోమవారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడ బోర్డులో కొన్ని అక్షరాలపై ప్లేట్లను తొలగించారు. వాటి లోపల విద్యుత్ తీగలు, చిన్న సైజు బల్బులను బద్దలుకొట్టేశారు. మంగళవారం ఇక్కడకు వెళ్లే సందర్శకులు అయ్యో రామా అప్పుడే దీన్ని పాడు చేసేసేశారా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన వాటిని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని సూచిస్తున్నారు. ఆకతాయిలను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన సీపీ త్రివిక్రమ్ వర్మ



జడ్జి గోపికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం జిల్లా జడ్జి జి.గోపిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) నాగన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోన్-3 స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా గిరిబాబు



అప్పారి గిరిబాబు

మద్దిలపాలెం: జీవీఎంసీ జోన్-3 లీగల్ సెల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా అడ్వకేట్ అప్పారి గిరిబాబు నియామకమయ్యారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనతో పాటు జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లకు ఎనిమిది మంది లీగల్ కౌన్సిల్ సభ్యులను నియమించారని గిరిబాబు తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి, జీవీఎంసీ కమిషనర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో బుధవారం టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వార్డులో పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు అంతా కృషి చేయాలని, గల్లంతైన అర్హుల ఓట్లు మళ్లీ చేర్చే విధంగా ప్రయత్నించాలని నాయకులు రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మూది అప్పారావు, పేపర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

16న మెగా షష్టిపూర్తి కార్యక్రమం

బీచ్ రోడ్డు: వాసవీ డిస్ట్రిక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న 102 మంది దంపతులకు షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ కందుల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కంటి చూపుపై అప్రమత్తత అవసరం

ఆరిలోవ: కంటి చూపుపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎల్వీపీ కంటి ఆస్పత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ శివాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏళ్ల వయసు దాటినప్పటి నుంచి కంటి చూపునకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. దూరదృష్టి, పొడికన్ను సిండ్రోమ్, శుక్లం, గ్లకోమా తదితర సమస్యలు వస్తాయని, వాటి నుంచి కంటికి రక్షణ కల్పించుకోవడానికి 40 ఏళ్ల దాటినవారు తరచూ వైద్యులను సంప్రదించాలని సూచించారు. దగ్గరగా ఉన్న వస్తువులను సరిగా చూడలేకపోవడం, కళ్లు పొడిబారడం తదితర వాటి వల్ల రానురాను మసక పెరుగుతుందన్నారు. అలాంటి సమస్యలు రాకండా ముందుగానే వైద్యులను సంప్రదించాలన్నారు.

అప్పన్నను దర్శించుకున్న పీఆర్ కమిషనర్ సూర్యకుమారి



కప్పస్తంభం వద్ద సూర్యకుమారి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధ వారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆమెకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో త్రినాథరావు ఆమెకు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



16వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల బుధవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి ఆమె కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ పాత వెంకోజీపాలెంలో రూ.9.80 లక్షలతో పైపులైన్ మరమ్మతు పనులు, అంబేడ్కర్ కాలనీలో రూ.4.50 లక్షలతో హెచ్‌డీపీఈ డిస్ట్రిబ్యూషన్ పైపులైను మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ పనులు సత్వరమే పూర్తి చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాకారమవుతుందని జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య అన్నారు. పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థు లకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నా యి. శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరాల సత్తిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

39 మందికి శాశ్వత గృహ హక్కు పట్టాలు



లబ్ధిదారులకు జగనన్న శాశ్వత గృహ హక్కు పట్టాలు అందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వారి కల నెరవేరింది. మేయర్ చేతుల మీదుగా శాశ్వత గృహ హక్కు పత్రాలు అందుకుని సంబరపడిపోయారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పట్టాలను బుధవారం పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆరిలోవ 11వ వార్డు పరిధి 8వ సచివాలయంలో 39 మంది లబ్ధిదారులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు గృహాలపై శాశ్వత హక్కు కల్పిస్తున్నారన్నారు. ఆరిలోవ ప్రాంతంలో దశాబ్దాలుగా హక్కులతో కూడిన పట్టాలు లేక ఇబ్బందిపడుతున్న వారికి రిజిస్ట్రేషన్ పట్టాలు జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా 39 మంది లబ్ధిదారులకు ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ పట్టాలు అందించామన్నారు. మిగిలిన వారికి కూడా దశల వారీగా అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య ఉద్యానవనం సందర్శన



పార్కులో సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులు

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు బుధవారం సందర్శించారు. సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో బీఎస్సీ(అగ్రికల్చరల్) కోర్సు అభ్యసిస్తున్న 40 మంది విద్యార్థులు బోధన సిబ్బంది కె.చరిష్మ, ఎల్.ఊర్మిళ, తేజస్వినిల నేతృత్వంలో సందర్శించి వివిధ మొక్కల ప్రత్యేకతలు తెలుసుకున్నారు. అనంతరం మధురవాడలోని శ్రీనివాస కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన 30 మంది విద్యార్థులు బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వందలాది ఔషధ మొక్కలను చూసిన వీరంతా ఆనందం వ్యక్తం చేశారు. ప్రతీ ఔషధ మొక్క దగ్గర దాని విశేషాలు తెలియజేస్తూ శిలా ఫలకాలు ఏర్పాటు చేయడం భాగుందన్నారు. పార్కు విశేషాలను నిర్వాహకుడు మంథా రామమూర్తి విద్యార్థులకు వివరించారు. పార్కులో పలు మొక్కలు పుష్పాలతో కనువిందు చేస్తున్నాయి. టర్నెరా ఉల్మిఫోలియా, టర్నేరా సుబులటా, గార్డెనియా గుమ్మిఫెరా, బ్రున్‌ఫెల్సియా డెన్సిఫోలియా మొక్కలకు పుష్పాలు పూశాయి.

జగనన్నే మళ్లీ సీఎం కావాలని పూజలు

- భద్రాచలం చేరిన బస్సు యాత్ర



భద్రాచలంలో అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు, డ్వాక్రా ఆర్పీలు

సీతంపేట: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు చేపట్టిన బస్సు యాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. డ్వాక్రా ఆర్పీలు, స్థానిక మహిళా నాయకులతో కలిసి మంగళవారం ఉదయం సీతంపేట మూడు గుళ్ల నుంచి బస్సులో యాత్రకు బయలుదేరిన విషయం తెలిసిందే. మార్గమధ్యలో అనకాపల్లి నూకాలమ్మ, తలుపులమ్మ లోవలో అమ్మవార్లకు పసుపు కుంకుమ సమర్పించి మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రార్థించారు. అక్కడి నుంచి భద్రాచలం చేరుకుని సీతమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. సీతారాములకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. గత నాలుగేళ్లగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వేడుకున్నారు. అనంతరం సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటి ప్రయోజనాలు నేరుగా మహిళలకే అందజేస్తున్నారని గుర్తుచేశారు. లంచాలు, అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పథకాలు అందజేసి, ప్రజలందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడే మరలా సీఎం కావాలని యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భీమవరపు శ్రీనివాసరావు, నమ్మి పద్మా వెంకట్ పాల్గొన్నారు.

‘మా నమ్మకం నువ్వే జగన్’కు నీరాజనాలు



16వ వార్డులో ప్రజలు సూచనలు పుస్తకంపై రాసుకుంటున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పార్టీ నాయకులు

మద్దిలపాలెం: ‘జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. తూర్పు నియోజకవర్గం పరిధి 16వ వార్డులో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరుగా సాగింది. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఇంటింటికీ వెళ్లారు. నేరుగా ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పనితీరు, పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలు తెలుసుకుని నోట్ చేసుకున్నారు. అన్ని చోట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ఆమోదం మేరకు వారితోనే సీఎం జగన్ ఉన్న స్టిక్కర్‌ను ఇళ్ల గోడలకు అతికించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆత్మీయగా స్వాగతం పలుకుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు పోల రత్నం, గృహ సారథులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16 నుంచి సింహగిరిపై చందనం అరగదీత

- మూడు మణుగులు అరగదీసేందుకు ఏర్పాట్లు



ఆలయ బేడా మండపంలో సిద్ధం చేసిన శానలు

సింహాచలం : సింహగిరిపై తొలివిడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈఓ ఇజిరోతు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ఆలయంలో తొలి చందనం చెక్కకు పూజలు నిర్వహించిన అనంతరం అరగదీత ప్రారంభమవుతుందని తెలిపారు. పన్నెండు మణుగుల చందనం (480 కిలోలు చందనం)లో ఉండే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ రోజు (చందనోత్సవం రోజు) మాత్రమే నిజరూప దర్శనాన్ని అందజేస్తారు. అదే రోజు రాత్రి స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని (120 కిలోలు) సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేస్తారు. తదుపరి వైశాఖ, జ్యేష్ఠ, ఆషాడ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని (120 కిలోల చొప్పున) స్వామికి సమర్పిస్తారు. ఈ నెల 23న చందనోత్సవం కావడంతో ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించేందుకు కావాల్సిన చందనాన్ని సమకూర్చేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆలయ బేడా మండపంలో అరగదీతకు వీలుగా శానలను ఏర్పాటు చేశారు.

ఆలోచింపజేసిన ‘వెండి అంచులు’



వెండి అంచులు నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో వెండి అంచులు నాటకాన్ని ప్రదర్శించా రు. పల్లూరా శివప్రసాద్ రచించిన ఈ నాటకానికి గంగోత్రిసాయి దర్శకత్వం వహించగా.. సంగీతం సత్యనారాయణమూర్తి సమకూర్చారు. ఏడు పదుల దాటిన వయసులో పురుషుడు తనకంటే చిన్నది అయిన మహిళను పెళ్లి చేసుకోవచ్చా అనే అంశంపై ప్రదర్శించిన నాటక అందరిని మేల్కొలిపింది.

అనంతరం రెండో నాటకంగా పెందుర్తికి చెందిన శ్రీనటరాజ డ్రమటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనుకోని అతిథి నాటకాన్ని ప్రదర్శించారు. దీనిని రావి నాగేశ్వరరావు రచించగా, పిల్లా సన్యాసిరావు దర్శకత్వం వహించారు. మనిషి బతకడానికి కావల్సింది డబ్బే కాని.. డబ్బే సర్వస్వం కాదనే ఇతి వృత్తంతో సాగిన ఈ నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది.

కార్మిక చట్టాలు నిర్వీర్యం

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ముకాస్తూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ విమర్శించారు. విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 790వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎల్ఎంఎంఎం మరియు ఎస్‌బీఎమ్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి బీటెక్ విద్యార్థి దుర్మరణం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ప్రమాదం



బీటెక్ విద్యార్థి నాని



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మృతిచెందిన నాని

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డులోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం సమీపంలో బుధవారం అర్ధరాత్రి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీస్‌లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోలుగుంట మండలంలోని అడ్డసార శివారు మత్రిపాలెం గ్రామానికి చెందిన కూరాకుల చిన్నబ్బాయి చిన్న కుమారుడు నాని(21)తగరపువలసలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన అతడు బుధవారం రాత్రి బైక్‌పై తగరపువలసలోని కళాశాలకు తిరిగి వెళ్తున్నాడు. ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ బలంగా ఢీకోవడంతో హెల్మెట్ నుజ్జు నుజ్జు అయి తలకు తీవ్రగాయాలయ్యాయి .దీనితో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హులకు జగనన్న ఇళ్ల మంజూరు లక్ష్యం



9వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తున్న అక్కరమాని

ఆరిలోవ: అర్హులైన నిరుపేదలు అందరికీ జగనన్న ఇళ్లు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధి కొండవాలు రామాలయం వీధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వాటి వల్ల ఎంత మేరకు లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకున్నారు. కొండవాలులో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, సరైన రోడ్లు లేకపోవడం, క్షీణించిన పారిశుధ్యం, తదితర సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కారిస్తామని అక్కరమాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.